క్లుప్తంగా

అధినేతను కలిసిన మహేంద్రరెడ్డి



గూడూరురూరల్ : తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్‌జగన్ మోహన్ రెడ్డిని మంగళవారం గూడూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, జగనన్న సేవా సమితి అధ్యక్షుడు ఊటుకూరు మహేంద్రరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని కూడా కలసి శాలువతో సత్కరించారు.



రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని శాలువతో సత్కరిస్తున్న మహేంద్రరెడ్డి

నిత్యాన్న పథకానికి విరాళం

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి నిత్యాన్న పథకానికి నెల్లూరుకు చెందిన పూవేటి పరంధామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన ధర్మపత్ని అరుణమ్మ రూ.లక్ష నగదును విరాళంగా మంగళవారం అందించినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. దాతకు మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, తీర్థప్రసాదాలు అందించినట్లు వివరించారు.

కండలేరులో 58.930 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 58.930 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3600 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 500, పిన్నేరుకాలువకు 70, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటిబ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

అనుబంధ పోషకాలు అందించాలి

వెంకటగిరి రూరల్: శిశువు జన్మించిన 7వ నెల నుంచి పిల్లలకు అనుబంధ పోషకారం అందించాలని సీడీపీఓ శంషాద్‌బేగం సూచించారు. పట్టణంలోని బీసీ కాలనీలో పోషణ మాసోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శిశువు జన్మనించిన అరగంటలో ముర్రుపాలు తాగించాలని తెలిపారు. సుమారు 6 నెలల పాటు తల్లిపాలు మాత్రమే బిడ్డకు తాగించాలని సూచించారు. కార్యక్రమంలో టీవీఎస్ సంస్థ ప్రతినిధి జైసింగ్, మహిళా పోలీసు ప్రసన్న, మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

గూడూరురూరల్ : పౌష్టికాహారంతోనే గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ మెహబూబి అన్నారు. గూడూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ నరసింగరావుపేట సెక్టారు పరిధిలోని ఇందిరానగర్, మిలిటరి కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఆహార ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

సీజేఐపై దాడికి యత్నం హేయమైన చర్య



నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

గూడూరురూరల్ : భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) బి.ఆర్.గవాయ్‌పై సుప్రీంకోర్టులో జరిగిన దాడియత్నం హేయమైన చర్య అని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కె.వి.పి.ఎస్) నాయకులు ఖండించారు. ఈ మేరకు మంగళవారం గూడూరు పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కేవీపీఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య మాట్లాడుతూ సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

చికెన్ ధరలు		08-10-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	128
లేయర్ లైవ్	:	122
బ్రాయిలర్ చికెన్	:	230
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	256
లేయర్ చికెన్	:	207

పైసలిస్తేనే 'ఆటో' పథకం

సూళ్లూరుపేట మండలంలోని దామానెల్లూరు గ్రామానికి చెందిన కల్లిపూడి సుధాకర్‌రెడ్డి ఆటో నడిపి జీవనం సాగిస్తున్నాడు. ఆటో డ్రైవర్ సేవలో పథకం లబ్ధిదారుల జాబితాలో ఆయన పేరు వచ్చింది. వెంటనే సచివాలయానికి వెళ్లితే, ఈ పథకం అందాలంటే రూ.3వేలు ఇవ్వాలని అక్కడి సిబ్బంది డిమాండ్ చేయడం గమనార్హం.

- కూటమి నాయకులకు నచ్చితే అర్హత
- అన్యాయమైపోతున్న అర్హులు
- రాజకీయ నేతల గుప్పిట్లో అధికారులు



సూళ్లూరుపేట రూరల్ : నియోజకవర్గంలో కూటమి నేతలు చెప్పిన వారికే ఆటో డ్రైవర్ సేవలో పథకం అందుతోంది. దీనికితోడు సచివాలయ అధికారులు, సిబ్బంది కూటమి నాయకుల చేతిలో కీలుబొమ్మలా మారారు. ఫలితం అర్హులకు అందాల్సిన ఆటో పథకం సేవలు కూటమి నాయకులకే అందుతున్నాయి. నియోజకవర్గంలోని 2010 మంది ఆటో డ్రైవర్లకు గాను 1970 మంది ఆటో పథకం ద్వారా లబ్ధిపొందారు. అయితే లబ్ధిపొందిన ప్రతి చోటా సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తుంచారు. రూ.3వేలు ఇస్తేనే ఈ పథకం అందుతుందని చెబుతుండడంతో ఆటో డ్రైవర్లు అయోమయంలో పడ్డారు. దీనికి తోడు కూటమి నాయకులు కూడా వారికి నచ్చిన వారికే పథకం వచ్చేలా చేస్తున్నారు. అర్హులైన వారికి కావాలనే పథకం రాకుండా ఆపుతున్నారు. ప్రశ్నించినవారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. దీంతో అర్హులైన లబ్ధిదారులు బోరుమని విలపిస్తున్నారు.

గత ప్రభుత్వంలో చేయూత

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆటో కార్మికుల కష్టాల గుర్తించి వారి సంక్షేమం కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. అర్హులైన ఆటో ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్, డ్రైవర్లకు రూ.10 వేలు చొప్పున ఏటా వారి ఖాతాల్లో జమ చేసేవారు దీంతో పాటు వాహన డ్రైవర్ ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల బీమా వర్తింపచేశారు. వాహనాల కొనుగోలుకు బ్యాంకు నుంచి రుణాలు తీసుకునే డ్రైవర్లకు రూ.లక్ష వరకు వడ్డీ రాయితీ అందించారు.

రైతులకు అండగా ఉంటా



దేవుడి మాన్యం రైతులతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: రైతులకు ఏ కష్టమొచ్చినా నేదురుమల్లి కుటుంబం అండగా ఉంటుందని, ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. మండల కేంద్రంలోని వాకాడు, గొల్లపాళెం గ్రామాలకు చెందిన దేవుడి మాన్యం లీజు రైతులు మంగళవారం రామ్‌కుమార్‌రెడ్డిని వాకాడులో కలసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. రైతులు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్రతి సారీ దేవుడిమాన్యం లీజు రైతులను ఆ శాఖ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ఆదరువుతో దశాబ్దాల కాలంగా భూమి లేని పేదలు సాగు చేసుకుంటూ అందులో వచ్చిన ధాన్యంలో కొంత ధాన్యం లీజు కింద దేవాలయాల అభివృద్ధికి సమర్పించి జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే 2014–2019 మధ్య ఐదేళ్ళ కాలంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వంలో ఎండోమెంటు అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లోనై తమపై లీజు భారం మోపుతూ అధిక లీజులతో వేలం పాటలకు సిద్ధమయ్యారని చెప్పారు. ఆ సమయంలో రామ్‌కుమార్‌రెడ్డి జోక్యం చేసుకుని వేలం పాటలను రద్దు చేసి ఎవరి భూములను వారికే కేటాయించారన్నారు. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని కౌలు రైతులు రామ్‌కుమార్‌రెడ్డికి వివరించారు. స్పందించిన రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ భూములకు అధికారులు పద్ధతి ప్రకారం వేలం నిర్వహించాలని సూచించారు. అధికారుల గణాంకాల ప్రకారం నాగేశ్వరస్వామి, అలఘునాధ స్వామి, కోదండరామస్వామి ఆలయాలకు సంబంధించిన భూముల విస్తీర్ణం ఎంత ఉండాలి? ప్రస్తుతం ఎంత ఉందన్న సంగతి గ్రామ ప్రజలకు తెలపాలన్నారు. ఆ భూముల్లో కౌలు వేలం నిర్వహించే ముందు ఆయా రైతులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలా కాకుండా నిబంధనలకు విరుద్ధంగా మీ ఇష్టానుసారంగా కొంత భూములకు మాత్రమే వేలం పాటలు నిర్వహిస్తే ఊరుకునేది లేదన్నారు.

క్రీడాస్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలి



క్రికెట్ పోటీలను ఆరంభిస్తున్న మేరిగ మురళీధర్

చిల్లకూరు : క్రీడాస్ఫూర్తితో వ్యవహరిస్తే ఏరంగంలోనైనా రాణించవచ్చని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో చెగువేరా, రాయల్ క్రికెట్ క్లబ్ సంయుక్తంగా ఫ్రెండ్‌షిప్ కప్ చాంపియన్ షిప్ పేరుతో మూడు రోజులపాటు క్రికెట్ పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ పోటీలను ఆరంభించిన మేరిగ మురళీధర్ మాట్లాడుతూ క్రీడాకారుల మధ్య పోటీతత్వం స్నేహపూరితంగా ఉండాలని సూచించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం మనపాటి రవి బౌలింగ్ చేయగా మేరిగ మురళీధర్ బ్యాటింగ్ చేసి పోటీలను ఆరంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చెగువేరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు మండ్ల సురేష్‌బాబు, సీనియర్ రొటేరియన్ కొణిదల మునిగిరీష్, రాయల్ క్రికెట్ క్లబ్ వ్యవస్థాపకులు మణి, మానికల పవన్‌కుమార్, మండ్ల రాజేష్, వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం కన్వీనర్ నందవరం సుబ్బారావు, నాయకులు దువ్వూరు దిలీప్‌రెడ్డి, హాకీ కోచ్ ఆకాష్ దీపక్, సుశీల్ కల్యాణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వెంకటగిరికి నేదురుమల్లి రాక

సైదాపురం: వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం వెంకటగిరికి రానున్నారు. ఆయన తన నివాసంలో ఉదయం 9గంటల నుంచి కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉంటారు. ఈ మేరకు నేదురుమల్లి కార్యాలయం వర్గాలు మంగళవారం ప్రకటన విడుదల చేశాయి.

నేడు రాపూరులో డిజిటల్ బుక్ ఆవిష్కరణ

రాపూరు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను కాపాడుకునేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచన మేరకు వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ స్కానర్‌ను బుధవారం ఆవిష్కరించనున్నారు. మండలంలోని పాపకన్ను మధుసూదన్‌రెడ్డి గార్డెన్‌లో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఉదయం 10.30 గంటలకు వైఎస్సార్‌సీపీ నాయకుల సమక్షంలో ఈ బుక్ ఆవిష్కరించనున్నట్లు మండల కన్వీనర్ బొడ్డు మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దందోలు లక్ష్మీనారాయణరెడ్డి, నియోజకవర్గ వలంటీర్ విభాగ అధ్యక్షులు దుగ్గిరెడ్డి నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎసార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు హాజరు కానున్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి తరలిరావాలని ఆ ప్రకటనలో కోరారు.

తిమ్మనాయుడుపాళెంలో రేషన్ కష్టాలు



రేషన్ దుకాణంలో నిల్వ చేసిన బియ్యం

కోట: మండలంలోని తిమ్మనాయుడు పాళెం గ్రామస్తులకు రేషన్ కష్టాలు తప్పడం లేదు. ఈ నెల 7వ తేదీ దాటినా ఇంత వరకు రేషన్ సరుకులు పంపిణీ చేయకపోవడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి నెలా 1వ తేదీ నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేయాలి. ఉన్న రేషన్ డీలర్‌ను మార్చి టీడీపీ నాయకుల ఒత్తిడితో అధికారులు మరో డీలరును నియమించారు. అయితే అతనికి ఈ–పాస్ మిషన్ కేటాయించకపోవడంతో వచ్చిన ఈ నెల కోటా బియ్యం పంపిణీ కాక రేషన్‌షాపులోనే ఉంది. విషయం తెలియని కార్డుదారులు స్టోర్ వద్దకు చేరుకుని పడిగాపులు కాసి ఎదురుచూసి తిరిగి వెళుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ జయజయరావును వివరణ కోరగా రేషన్ సరుకుల పంపిణీలో ఆలస్యమైందని, స్థానిక వీఆర్‌ఓ ద్వారా బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బడి గోడకే రాజకీయ ఫ్లెక్సీ



చిట్టమూరు: ''అంతా మా ఇష్టం మాకు ఎదురు చెప్పేవారెవరు'' అంటున్న చందంలా ఉంది కూటమి నాయకుల తీరు. గుడి, బడులపై రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు పెట్టి తమ హవా చూపుకుంటున్నారు. ఈ క్రమంలో మండలంలోని మల్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలపై పాఠశాల నేమ్ బోర్డుకు అడ్డంగా ఏకంగా రాజకీయ నాయకులతో వేపిన ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో ఫ్లెక్సీల కలకలం రేగింది.

మనమంతా జగనన్న సైన్యం



కోటక్రాస్‌రోడ్డులో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న పేర్నాటి, నాయకులు

కోట: మనమంతా జగనన్న సైన్యం... జగనన్న ఇచ్చిన ధైర్యంతో అందరం కలసికట్టుగా ముందుకు సాగుదామని సీఈసీ సభ్యుడు పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడిగా నియమితులైన పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి సన్మాన కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. సీఈసీ సభ్యుడిగా నియమితులైన తరువాత తొలిసారి స్వగ్రామం అల్లంపాడుకు విచ్చేసిన పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. విద్యానగర్ నుంచి కోట మీదుగా అల్లంపాడు వరకు నిర్వహించిన కార్ల ర్యాలీ ఆకట్టుకుంది. విద్యానగర్‌లో గాంధీ విగ్రహానికి, కోటక్రాస్‌రోడ్డులో వైఎస్సార్ విగ్రహానికి, కోట టౌన్‌లో అంబేడ్కర్, పొట్టి శ్రీరాములు, గాంధీ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అల్లంపాడుకు ర్యాలీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపింది. కోట వీధుల్లో వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలాడాయి. కోటలో మహిళలు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. విద్యానగర్‌లో బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని, మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డిని ఆశీర్వదించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్‌రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాక్రిష్ణారెడ్డి, చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, నరమాల రమణయ్య, దువ్వూరు సాయిక్రిష్ణారెడ్డి, రమణారెడ్డి, పెళ్లూరు కోటేశ్వరరెడ్డి, చంద్రభూషణ్‌రెడ్డి, సురేంద్ర, బుజ్జయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ భవాని

రాపూరు: మండలంలోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ భవాని సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ లక్ష్మీనరసింహం మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను ముందుగా వీఆర్‌ఓకు సమస్య వివరించాలని అక్కడ పని జరగకపోతే మండల తహసీల్దార్ కార్యాలయానికి రావాలన్నారు. చిన్నచిన్న సమస్యలు వీఆర్వోనే పరిష్కరిస్తారని చెప్పారు. కో–ఆప్షన్ సభ్యులు సయాద్ మాట్లాడుతూ ఆధార్ కేంద్రాన్ని మద్దెలమడుగులో కాకుండా రాపూరులో ఏర్పాటు చేస్తే మండల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. టీటీడీ కల్యాణ మండపం నిర్మించేందుకు మండల తీర్మానాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసన్న, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు ప్రసన్న, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, వెంకటస్వామి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న డాక్టర్ పుట్టా రమణయ్య

సైదాపురం: పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని నెల్లూరు డివిజనల్ పంచాయతీ అధికారి డాక్టర్ పుట్టా రమణయ్య ఆదేశించారు. మండలంలోని లింగనపాళెం గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణను మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్లు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రానికి తరలించి వర్మీకంపోస్టు తయారు చేసి పంచాయతీ ఆదాయ వనరులను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ వెంకట రమణయ్య, కార్యదర్శి ఉదయ్‌కుమార్ తదితరులున్నారు.

దర్జాగా భూ ఆక్రమణ



ప్రభుత్వ భూమి ఆక్రమించి చదును చేస్తున్న దృశ్యం

చిట్టమూరు: మండల పరిధిలోని నార్తువరత్తూరు గ్రామ కాట్రేవు చెరువు పోరంబోకు భూమి, తెలుగు గంగ కాలువను నిలువునా జేసీబీతో పూడ్చివేస్తున్న సంఘటన మంగళవారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన టీడీపీ నేత చెరువు పోరంబోకు భూమిని జేసీబీతో చదును చేసి ఆక్రమిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. పలు గ్రామాల చెరువులకు తెలుగు గంగ నీరు సరఫరా అయ్యే కాలువను కూడా పూడ్చి ఆక్రమించేశాడని పేర్కొన్నారు. సుమారు రెండెకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి వరి పంట వేసేందుకు సిద్ధం చేస్తున్నాడని చెప్పారు. పది రోజు క్రితం ఇదే టీడీపీ నేత చెరువు పోరంబోకు భూమి, తెలుగు గంగ కాలువను ఆక్రమిస్తుండగా అధికారులు నోటీసులు జారీ చేసి ఆక్రమణను అడ్డుకున్నారు. అయితే ఈ సారి దమ్ముంటే అడ్డుకోండి చూద్దాం అంటూ పట్టపగలు జేసీబీ పెట్టి ప్రభుత్వ భూమిని చదును చేస్తున్నాడని గ్రామస్తులు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలు ఆపాలని నార్తువరత్తూరు గ్రామస్తులు కోరుతున్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో చండీహోమం



ముత్యాలమ్మ ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న ఉభయకర్తలు

చిల్లకూరు: తీర ప్రాంతంలో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో ప్రతి నెలా పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులు చండీహోమం చేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో భాగంగా మంగళవారం పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులు అర్చకులు శివకుమార్‌స్వామి వారి వద్ద చండీహోమం చేయించారు. ఉభయ కర్తలుగా వ్యవహరించిన గూడూరుకు చెందిన టమాటా మర్చంట్ సెల్వరాజ్ కుటుంబ సభ్యులు ముందుగా ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం కలశాలతో ఆలయ ప్రదక్షిణ పూర్తి చేశారు. అనంతరం యాగ మండపంలో రుత్వికులు హోమం కార్యక్రమాన్ని చేస్తుండగా పూజా సామగ్రిని అగ్ని దేవునికి ఆహుతి ఇచ్చి హోమం పూర్తి చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను ఆలయ సిబ్బంది అందించారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్ భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పర్యవేక్షించారు.